నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 1 ఏప్రిల్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

వెల్దండ మండలం కొట్రలో చేతికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ముస్లింలు

- నల్లగుడ్డలు, బ్యాడ్జీలు ధరించిన ముస్లింలు
- పండుగ వేళ వ్యతిరేకంగా..
- వక్ఫ్ భూములపై కేంద్రం వైఖరి సరికాదని హితవు
- బోర్డు పరిధిలోనే ఆస్తులు ఉండాలని డిమాండ్

వక్ఫ్ బిల్లుపై నిరసన గళం

రంజాన్ పండుగ వేళ కేంద్రం తెచ్చిన వక్ఫ్ బిల్లుపై ముస్లింలు నిరసన గళం లేవనెత్తారు. నేషనల్ మైనార్టీ అసోసియేషన్ పిలుపు మేరకు పండుగ వేళ కొత్త దుస్తులు ధరించి చేతులపై నల్లగుడ్డలు, నల్లబ్యాడ్జీలు ధరించారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వినూత్నంగా ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వక్ఫ్ భూములపై కేంద్రం వైఖరి సరికాదని.. సంస్థ ఆస్తులు వక్ఫ్ బోర్డు పరిధిలోనే ఉండేలా ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిన నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని సూచించారు. ఈ విధానం అమలైతే వక్ఫ్ బోర్డు ఆస్తులు, ఖబ్రస్థాన్లు, ఇతరత్ర ఆస్తులపై కేంద్రం అజమాయిషీ నడుస్తుందన్నారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మార్చి 31



వనపర్తిలో చేతికి నల్ల గుడ్డలు ధరించి ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయమే కొత్త దుస్తులు ధరించి ఈద్గాలు, మసీదుల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు పండుగ సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మహబూబ్‌నగర్, వనపర్తిలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, నారాయణపేట, కల్వకుర్తి, మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, చిట్టెం రామ్మోహన్‌రెడ్డితోపాటు ప్రస్తుత ఎమ్మెల్యేలు, నాయకులు ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మార్చి 31

భక్తి శ్రద్ధలతో రంజాన్

- ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లింలకు ఈద్ ముబారక్ చెప్పిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

వనపర్తిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నిరంజన్‌రెడ్డి

పాలమూరులో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

మతసామరస్యానికి ప్రతీక

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- వనపర్తిలో ముస్లింలకు శుభాకాంక్షలు

వనపర్తి టౌన్, మార్చి 31 : రంజాన్, ఉగాది పండుగలు ఒకేసారి రావడం శుభసూచకమని, ఇది మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం మాజీ మంత్రి స్వగృహంలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా మాజీ మంత్రిని ముస్లిం మత పెద్దలు శాలువాతో సన్మానించారు. అలాగే ముస్లిం మత పెద్దలను మాజీ మంత్రి ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు రంజాన్ తోఫా, షాదీముబారక్ అందించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఇమ్రాన్, రహీం, గులాం ఖాదర్, జోహెబ్ హుస్సేన్, ఖాదర్, బీఆర్ఎస్ నాయకులు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, రమేశ్‌గౌడ్, కృష్ణ, తిరుమల్, రవి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, గిరి, రాము, రహీం, శ్రీను, సర్దార్‌ఖాన్ పాల్గొన్నారు.

ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఈద్గా వద్ద మాజీ మంత్రికి అవమానం

- నిరసన వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నేతలు

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 31 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం రంజాన్ ప్రార్థనల అనంతరం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపే వేదిక మీద మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సీటు కేటాయించక పోవడంత తీవ్ర దుమారం రేపింది. ప్రతిసారి సంప్రదాయాలకు భిన్నంగా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన ఈ వేదిక మీద కేవలం కాంగ్రెస్ వారికి మాత్రమే సీట్లు కేటాయించారు. అంతేకాకుండా ఏకంగా కుర్చీలకు నేమ్ బోర్డులు పెట్టారు. దీంట్లో మాజీ మంత్రి పేరు లేదు. గతంలో అన్ని పార్టీల నేతలను గౌరవించే సంప్రదాయం కొనసాగేది. ఈసారి ఈద్గా కమిటీ కూడా పాత పద్ధతికి తిలోదకాలు ఇవ్వడంతో బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వేదిక పక్కకు వచ్చి మాజీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో కావాలని అవమానించారని విరుచుకుపడ్డారు. కాగా వేదిక మీద లేకున్నా చాలామంది మాజీ మంత్రిని కలిసేందుకు పోటీ పడ్డారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నేతలు ఖంగుతిన్నారు.

పండుగలతో సోదరభావం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 31: పండుగలు సోదరభానికి నిదర్శనమని.. రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం రంజాన్ పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు సమీపంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి మాట్లాడుతూ.. హిందూ, ముస్లిం బేధాభిప్రాయాలు లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వంలో గంగా, జమున, తహజీబ్‌ను తీసుకొచ్చి దేశంలో ఆదర్శంగా నిలిచామన్నారు. ముస్లింల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రహమాన్, శివరాజ్, జావేద్ పాల్గొన్నారు.

అ'భయం'లేకపాయే!

ఊర్కొండపేట ఆలయం వద్ద ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వైభవ్ రఘునాథ్

- మహిళ పై మందుబాబుల సామూహిక లైంగిక దాడి
- బహిర్భూమికి వెళ్తే అఘాయిత్యం
- ఆలయ సమీపంలో అమానవీయ దుర్ఘటన
- చుట్టాలైన నిర్భయ, దిశ చట్టాలు
- ప్రశ్నార్థకమైన మహిళల రక్షణ

కల్వకుర్తి, మార్చి 31: ఊర్కొండ పేట రేప్ ఘటన మహిళలకు రక్షణ కరువైందనే వాదనలకు ఊతమిస్తున్నది. నిర్భయ, దిశలాంటి కఠిన మైన చట్టాలు ఎన్ని తీసుకొస్తున్నా.. మహిళలపై ఏదో ఒక చోట అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. ఊర్కొండ మండలం ఊర్కొండపేట ఆభయాంజనేయ స్వామి ఆలయం అంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధి. ఉమ్మడి పాల మూరు, రంగారెడ్డి, హైదరాబాద్ నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. శనివారం రాత్రి అభయాంజనేయుడి సన్నిధిలో భజనలు జోరుగా సాగుతాయి. ఎంతో మంది భక్తులు తెల్లవార్లు భజనలో పాల్గొంటారు. ఇలాంటి ఆలయానికి వచ్చే భక్తులకు సామూహిక లైంగిక దాడి ఘటన భయభ్రాంతులకు గురిచేస్తున్నది. ఆలయానికి సమీపంలో గట్టిగా కూతవేస్తే వినిపించే దూరంలో బహిర్భూమికి వచ్చిన మహిళపై 8మంది సామూహికంగా లైంగిక దాడికి పాల్పడడం చూస్తుంటే ఆలయం వద్ద భద్రతను గాలికొదిలేసినట్లే కనిపిస్తున్నది. ఆలయానికి మూడు కిలోమీటర్ల దూరంలో పోలీస్‌స్టేషన్ ఉందన్న భయం కూడా లేకుండా కామంతో కల్లు మూసుకు పోయి మానవ త్వాన్ని మరిచి బరితెగింపుతో మహిళపై లైంగిక దాడికి ఒడిగట్టడం చూస్తుంటే.. ఇంకా ఎలాంటి కఠినమైన చట్టాలు తీసుకొస్తే.. ఇలాంటి ఘటనలకు బ్రేక్ పడుతుంది. గుడిలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగి ఒకరు ఈ దుస్సంఘటనకు కేంద్ర బిందువయ్యాడని.. గుడికి వచ్చిన మహిళను ఆదినుంచి గమనించాడు. మహిళ రాత్రివేళ గుడి బయటకు వ్యక్తిగత అవసరాలకు వెళితే.. స్నేహితులకు సమాచారాన్ని చేరవేశాడు. మహిళను కాపుగాసి పట్టుకున్న స్నేహితులు సామూహికంగా లైంగికదాడి చేశారు. నేర ప్రవృత్తి కలిగిన తాత్కాలిక ఉద్యోగి ఆలయంలో ఎలా పనిచేస్తున్నాడేది మరో ప్రశ్న. శనివారం ఆలయం వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. చాలా మంది మహిళా భక్తులు అక్కడే నిద్ర చేస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో పోలీసులు అక్కడ ఎందుకు గస్తీ కాయడంలేదనే మరో ప్రశ్న వినిపిస్తుంది.

పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలి

వివాహితపై అత్యాచార ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని మానవతా వాదులు డిమాండ్ చేస్తున్నారు. అత్యాచారానికి పాల్పడింది 8లేదా 9మంది అని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటి వరకు పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులందరినీ అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆలయం వద్ద పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలని, నైతిక విలువలు కలిగిన వారిని ఆలయంలో ఉద్యోగులుగా నియమించుకోవాలని కోరుతున్నారు.

బహిరంగ మద్యపానమే కారణం

బహిరంగ ప్రదేశాల్లో, ఖాళీ ప్లాట్లలో మద్యం సేవిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించొద్దనే నిబంధనలు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం మాత్రం మద్యం అమ్మకాలపై రాబడిని చూస్తుంది. ఊర్కొండపేట ఘటనలో కూడా జరిగింది అదే. ఆలయానికి అతి సమీపంలో యువకులు మద్యం సేవిస్తున్నారు. వివాహిత అటువైపే వస్తుందనే సమాచారంతో మద్యం మత్తులో ఉన్న సదరు యువకులు లైంగిక దాడికి తెగబడ్డారు. శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రాష్ట్రంలో మహిళలపై దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ప్రజాస్వామ్యవాదులు మండిపడుతున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలతో మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజేందర్‌రెడ్డి
- గులాబీ పార్టీలో చేరిన 30మంది హస్తం కార్యకర్తలు

నారాయణపేట, మార్చి 31: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దామర గిద్ద మండలం మొగల్‌మడ్కకు చెందిన 30మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎస్ఆర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలే అయినా ప్రభుత్వ పాలనపై ప్రజలు పూర్తిగా విరక్తి చెందారని, దీంతో కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లోకి వలస వస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌లోకి మరిన్ని చేరికలు ఉంటాయని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమన్నారు. కార్యక్రమంలో వెంకట్రాంరెడ్డి, సుభాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతృదేవోభవ

- వందేండ్లు పూర్తి చేసుకున్న తల్లికి తులాభారం
- మాతృమూర్తిపై మమకారం చాటుకున్న తనయులు

లచ్చమ్మకు తులాభారం చేస్తున్న కుమారులు

కొత్తపల్లి(మద్దూల్), మార్చి 31: అమ్మను మించి దైవమున్నదా.. అంటే లేదంటారు ఈ కుమారులు.. తల్లిదండ్రులను అనాథ ఆశ్రమాల్లో ఉంచే ఈ రోజుల్లో తల్లే ప్రత్యక్ష దైవంగా భావించి కన్నతల్లికి వందేండ్లు పూర్తి కావడంతో సోమవారం ఆ మాతృమూర్తికి అరటి పండ్లతో తులాభారం చేశారు. కొత్తపల్లి మండలంలోని గోర్లోని బాలికి చెందిన జంబుల లచ్చమ్మకు సోమవారంతో వందేండ్లు నిండాయి. దీంతో లచ్చమ్మ కుమారులు బాలకిష్టయ్య, రాములు, వెంకటయ్య, భీమన్న, సహదేవ్‌తో పాటు ముగ్గురు కుమార్తెలు అరటి పండ్లతో తులాభారం చేసి కన్నతల్లిపై మమకారం చాటుకోవడంతో గ్రామస్తుల అభినందనలు పొందారు.

రైతు భరోసాకు చెయ్యిచ్చినట్లేనా..?

- పంట పెట్టుబడి సాయం గడువు ముగియడంతో రైతుల్లో అనుమానాలు
- 4ఎకరాల వరకు పూర్తికాని పెట్టుబడి సాయం
- పదేపదే సర్కారు మాట తప్పుతున్నదని ఆగ్రహం

కల్వకుర్తి, మార్చి 31: మార్చి 31గడువు ముగిసింది. రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమకాలేదు. జనవరి 26న రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు వేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి మరోసారి మాట తప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి రైతు భరోసా రోజుకొక మాట మాట్లాడారు. చివరకు రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.15వేలు కాకుండా రూ.12వేలు ఇస్తామని మాట మార్చారు. జనవరి 26న రైతులందరి ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు వేస్తామని ప్రకటించారు. చివరకు జనవరి 26 రానే వచ్చింది. ఆ రోజున రైతు భరోసాతో పాటుమరో 3 పథకాలను లాంఛనంగా ప్రారంభించారు. ట్విస్ట్ ఏమిటంటే సదరు పథకాలు కూడా మండలంలో ఒక్క పైలెట్ గ్రామంలో మాత్రమే పూర్తిస్థాయిలో అమలవుతాయని చావు కబురు చల్లగా చెప్పారు. రైతు భరోసా డబ్బులు మార్చి 31నాటికి పంట సాగుకు యోగ్యమైన ప్రతిఎకరాకు రైతుల ఖాతాల్లో జమచేస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో వేయడానికి జనవరి 26 నుంచి మార్చి 31వరకు అంటే దాదాపు 64రోజుల సమయం తీసుకున్నారు. 64 రోజుల్లో 4ఎకరాల వరకు కూడా రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమచేయలేదు. తమ ఖాతాల్లో రైతు భరోసా పెట్టుబడి సాయం డబ్బులు పడతాయేమోనని ఎదురు చూసిన రైతులకు నిరాశ తప్పలేదు. వానకాలం రైతు భరోసాకు మంగళం పాడిన రేవంత్ ప్రభుత్వం యాసంగికి కూడా మొండిచెయ్యి చూపిస్తుందనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో..

నాగర్‌కర్నూల్ జిల్లాలో 3,22,724 మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. వీరి ఆధీనంలో 7,59,793 భూమి సాగువుతోంది. గత కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.5వేల చొప్పున యాసంగికి రూ.379.90 కోట్లు, వానకాలానికి రూ.379.90 కోట్లు రైతుల ఖాతాల్లో క్రమం తప్పకుండా జమచేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు డిక్లరేషన్ అమలు చేస్తామని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక పథకం అమలుకు కమిటీలు వేసి కాలయాపనలో వానకాలం పెట్టుబడి సాయానికి మంగళం పాడింది. చివరికు యాసంగి నుంచి రూ.15వేలు కాకుండా రూ. 12వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది యాసంగికి ఎకరాకు రూ.6వేల చొప్పున జనవరి 26 రైతుల ఖాతాలలో వేస్తామని ప్రకటించారు.



ఆ గడువుకు కూడా దాటిపోయింది. విషయానికి వస్తే జిల్లాలో యాసంగికి రైతులలో ఖాతాలలో రూ.6 చొప్పున రూ.455.87 కోట్లు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేయాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటి వరకు 4ఎకరాల వరకు రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమచేశామని చెబుతున్నా.. 4ఎకరాల వరకు భూమి ఉన్న చాలామంది రైతుల ఖాతాల్లో డబ్బులు కాలేదని తెలుస్తుంది.

సాగుచేయని భూములకు..

ప్రభుత్వం సాగుకు యోగ్యంకాని భూములకు రైతుభరోసా ఇవ్వమని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. ప్రభుత్వం ఆదేశాలతో అధికారులు గుట్టలు, రాళ్లు, వెంచర్లు, ఫౌల్ట్రీలు, ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసిన భూములను గుర్తించి సాగుభూములు జాబితా నుంచి తొలగించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇప్పుడు మాత్రం మరో వార్త రైతులను గాబరా పెట్టిస్తున్నది. రెండేండ్ల నుంచి పంటవేయని పొలాలకు కూడా రైతు భరోసా ఇవ్వడం లేదని, ఇందుకు సంబంధించిన సమాచారం గ్రామాలవారీగా ఏఈవోల నుంచి జాబితా సేకరించిందనే సమాచారం రైతులకు చేరడంతో రైతుల నుంచి ఆందోళన వ్యక్తమవుతుంది. పంట వేయకుంటే రైతు భరోసా ఇవ్వరట.. అని రైతులు చర్చించుకుంటున్నారు. ఉదాహరణగా రైతుకు 5ఎకరాల పొలం ఉంటే 5 ఎకరాలను ఒకేసారి సాగు చెయ్యడు. వానకాలం కొంత, యాసంగికి కొంత సాగు చేసుకుంటాడు. నిరంతరంగా సాగు చేస్తే దిగుబడి రాదనే ఉద్దేశంతో రైతులు సదరు పొలాల్లో సంవత్సరానికి ఒక పంటను మాత్రమే సాగు చేస్తారు.

రైతుభరోసా జాప్యంపై రైతుల్లో అసహనం

రైతు భరోసా ఇవ్వడానికి గడువులు, నిబంధనలు విధిస్తుందని రైతు సంఘ నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికే వానకాలానికి సంబంధించి రైతు భరోసా ఎగ్గొట్టిందని, యాసంగికి ప్రభుత్వం ఎగ్గొట్టేందుకే గడువులు పెడుతూ కాలయాపన చేస్తుందని మండిపడుతున్నారు. రుణమాఫీ విషయంలో ఇలాగే గడువులు, కాలయాపన చేసి సగం మంది రైతులకు రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని రైతు నాయకులు గుర్తు చేస్తున్నారు. మార్చి 31 నాటికి పూర్తిగా రైతుభరోసా అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు దాని గురించి ఏం మాట్లాడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో యాసంగి, వానకాలానికి రైతు భరోసా తంచన్‌గా పడేదని గుర్తు చేసుకుంటున్నారు.

మాట తప్పడం కాంగ్రెస్ నైజం

మాట తప్పడం, హామీల అమలుకు గడువులు పెంచడం కాంగ్రెస్ ప్రభుత్వ సహజ లక్షణం. కాలయాపన చేస్తూ పరస్పర విరుద్ధ ప్రకటనలిస్తూ రుణమాఫీ పథకానికి మంగళం పాడిన సీఎం రేవంత్ ప్రభుత్వం రైతుభరోసాను కూడా రుణమాఫీ బాటలోనే తీసుకెళ్తుంది. ఎకరాకు రూ.15వేలు ఇస్తామన్నది వాళ్లే.. కాదుకాదు రూ.12 వేలు ఇస్తామన్నది వాళ్లే.. జనవరి 26న ఇస్తామన్నరు. తీరా కాదుకాదు మార్చి 31వరకు పూర్తిగా ఇచ్చేస్తామన్నారు. ఇప్పుడు ఆ గడువు కూడా అయిపోయింది. రైతులు పెట్టుబడి కోసం అరిగోస పడుతుంటే గడువులు పెడుతూ కాలాయాపన చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లింది. వినాయక చవితి, దసరా అనే గడువులు విధించకుండా వెంటనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు వేయాలి. లేకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటారు.

- బండెల రాంచంద్రారెడ్డి, రైతు జేఏసీ నేత, కల్వకుర్తి

పిచ్చి కుక్క స్వైర విహారం

- అలంపూర్‌లో ఆరుగురికి కాటు

అలంపూర్, మార్చి 31 : పిచ్చి కుక్క స్వైర విహారం చేయగా.. ఐదుగురికి గాయాలైన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. అలంపూర్ మున్సిపాలిటీలో 1, 2వ వార్డు పరిధిలో ఉన్న అంబేద్కర్, సంతోష్‌నగర్‌లో సోమవారం ఓ పిచ్చికుక్క ప్రత్యక్షమైంది. రెండు కాలనీలకు చెందిన వేణు, చిన్న, భరత్, రంగస్వామి, సతీశ్, గర్భిణి స్వప్న, అలెస్కతో పాటు ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి(6)ని కాటేసింది. బాధితులు అలంపూర్ సీహెచ్‌సీకి వెళ్లగా.. మందులు అందుబాటులో లేవని ఏపీలోని కర్నూల్ దవాఖానకు రెఫర్ చేశారు. దీంతో 108లో కర్నూల్‌కు వెళ్లారు. మున్సిపాలిటీలో కుక్కల బెడద ఎక్కువైందని ప్రజలు విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పిచ్చి కుక్క కాటుకు గురైన యువకుడు